# బంధం

"బేటా రఘూ! భోజనానికి రా బాబూ"

"వస్తున్నా బీబీజీ, ఒక్క పది నిమిషాలు."

రాత్రి పది కావస్తోంది. అప్పుడే షాపు కట్టేసి వచ్చాడు రఘు స్నానం చేసి, భోజనానికి బయలుదేరాడు. మాతాప్రసాద్ అప్పటికే డైనింగ్ టేబిల్ దగ్గర కూర్చున్నాడు.

"ఇంత ఆలస్యమైందేమిటి?"

"షాపు కట్టే సమయానికి కస్టమర్లు వచ్చారు బాబూజీ. మ్యూసిక్ సిస్టం, టీవీ కొనాలన్నారు. అవే కాకుండా మిక్సీ కూడా కొనిపించాను. బిల్ చేసి వారిని పంపేసరికి ఈ టైమయింది. ఆ పరికరాలు వారికి హోం డెలివరీ చేయాలి రేపు.

"గుడ్ నీ దగ్గరకొచ్చిన కస్టమర్స్‌ని వదులుతావా? అవునూ, ఇవాళ ఆక్యుపెన్సీ ఎంత?

"తొంబైశాతం. రెండు సింగిల్ రూములు ఓ డబుల్‌రూం మాత్రం ఖాళీగా ఉన్నాయి. మూడు హాళ్లూ బుక్కయ్యాయి."

"సీజన్ మొదలైందిగా, టూరిస్టులు రావడం మొదలెట్టారు. మన ఏజెంట్లతో కాంటాక్ట్‌లో ఉండు అవసరమనుకుంటే వారికో పార్టీ అరేంజ్ చెయ్. వాళ్లను తృప్తిపరిస్తేనే మన బిజినెస్ పెరిగేది."

"అది మీరు నాకు చెప్పాలా బాబూజీ?"

వారి సంభాషణ హిందీలో సాగింది.

మాతా ప్రసాద్ పాట్నాలోని సంపన్న వ్యాపారస్తుల్లో ఒకడు. ఓ స్టార్ హోటల్, ఓ థియేటర్, ఓ కుటుంబ పరికరాల పెద్ద షోరూం అతని సొంతం. ఇంకా కొన్ని వ్యాపారాల్లో భాగస్వామ్యం ఉంది. రఘు అతని దగ్గర మూడేళ్ళ నుంచి పనిచేస్తున్నాడు. మాతాప్రసాద్ బంగళా బయటి ఔట్‌హౌస్‌లో, అతని మకాం. భోజనం చేసి వచ్చి తన గది లోని పడకపై వాలిపోయాడు రఘు. ఓ తెలుగు పత్రిక తెరిచాడు. కళ్ళు అక్షరాల గుండా పరిగెత్తుతున్నాయి కానీ మనసులో ఏవో దృశ్యాలు...

'ఒకరి సంపాదనపై బతికే కంటే చావడం మేలు' తండ్రి రూపం కళ్ళముందుకొచ్చింది. ఆ మాటలే కదూ తనను ఇల్లు వదిలేలా చేశాయి? ఎక్కడి మామిడికుదురు? ఎక్కడ పాట్నా? సినిమాలకు అమలాపురం పోవడం, రాజోలులోని స్నేహితులు, రావులపాలెం సంతలో చేసిన చిలిపిచేష్టలు అన్నీ కళ్ళముందు కదలాడాయి. ఫోకస్ అతని కుటుంబంపై పడింది.

రఘు తండ్రి సీతయ్య ఓ చిన్నకారు రైతు. అతని ఇద్దరు కొడుకుల్లో రఘు చిన్నవాడు. తరవాత ఇద్దరు కూతుళ్లు. స్కూల్‌ఫైనల్ కాగానే పెద్దకొడుకు వ్యవసాయంలో చేరాడు. రఘు చదువులో చురుకైన వాడవడంతో డిగ్రీ దాకా చదివించాడు సీతయ్య. ఆ తరువాత జీవితం స్తంభించింది. రఘుకు అప్లై, అప్లై, నో రిప్లై. పెన్నులో ఇంకు ఇంకిపోయింది. ఇంటర్వ్యూలకు తిరిగి చెప్పులు స్లిప్పర్లయ్యాయి. డిగ్రీ తరువాత మూడేళ్ళ యాతన. ఉద్యోగ వేటలోని వైఫల్యం ఓ వైపైతే, ఇంట్లో వారి చురకలు ఇంకో వైపు. పట్టభద్రుడై ఉండి, ఇంట్లోని చిన్నా చితక పనులు చేయాలంటే నామోషిగా ఉండేది.

"అబ్బో మా పెద్ద డిగ్రీ హోల్డరు వీడొక్కడే ఉన్నాడు. ఈ రోజుల్లో డిగ్రీ చేసిన ఆడవాళ్ళు కూడా ఎందరో ఉన్నారు. ఉద్యోగం సంపాదించుకునే తెలివిలేదు కాని ఇంటి పనులు చేయమంటే మహాటెక్కు. ఏం చూసుకునో ఆ మిడిసిపాటు?"

"ఇరవై అయిదేళ్ళొచ్చాయి ఇంకా ఎంత కాలం మేపాలి నిన్ను?"

"పనిపాటా లేని అలగాజనంతో పోసుకోలు కబుర్లతో కాలం వెళ్లబుచ్చేకంటే పొలం పనుల్లో సాయం చేయొచ్చుగా?"

"చెట్టంత మగపిల్లవాడు ఖాళీగా ఉండగా వయసొచ్చిన ఆడపిల్లలను మార్కెట్టుకు పంపడం బావుంటుందా?" నాన్న, అమ్మ, అన్నల సూటిపోటి మాటలు. "అన్నయ్య ఉద్యోగం చేసి మమ్మల్ని ఉద్ధరిస్తాడని అనుకుంటే ఇంతే సంగతులు" చెల్లెళ్ళ మూతి విరుపులు. రఘు బతుకు నవ్వులపాలైంది. 'గడియ పురుసతు లేదు. గవ్వ కమాయి లేదు' అన్నట్లు ఉంది రఘు పరిస్థితి. తండ్రి నుంచి చిన్న చెల్లి దాకా జీతం లేని పని మనిషిగా వాడతారతన్ని.

ఇంట్లో ఎంత వెట్టి చాకిరి చేసినా గుర్తింపు లేదు. తను చేసేది డబ్బు లొచ్చే పనికాదుగా? సున్నిత మనస్కుడైన రఘు, తన క్లాస్‌మేట్ కృపాకర్‌తో చెప్పుకుని వాపోయేవాడు. గవర్నమెంటు ఉద్యోగాలే అంతంతమాత్రం. వాటిని దక్కించుకునే వనరులా తమ దగ్గర లేవు. ప్రైవేటు కంపెనీల్లో చూస్తే, పని బారెడు, జీతం జానెడు అయినా ప్రయత్నించారు. అక్కడా చుక్కెదురైంది. ఆ పోటీలో నెగ్గలేకపోయాడు.

"డిగ్రీ చదివి నువ్వు సాధించిందేమిటి? రెండు పూటలా తిండికి కూడా, మా మీదే ఆధారపడ్తున్నావు. ఒకరి సంపాదనపై ఒతికేకంటే చావడం మేలు" తాగిన మైకంలో ఓ రోజు సీతయ్య అన్నమాటలు సమ్మెట పోట్లలా తగిలాయి. అంతే.. మర్నాడు ఉత్తరం వైపు వెళ్లే రైలు ఎక్కాడు రఘు.

"ట్రింగ్..ట్రింగ్..

ట్రింగ్..ట్రింగ్..ట్రింగ్."

ఫోను రింగుతో వర్తమానంలోకి వచ్చాడు రఘు.

"హల్లో... " హోటలు నుంచి పిలుపు ఎవరో కస్టమర్ ఏ.సి పనిచేయడంలేదని గోలపెడుతున్నాడట. తనే పోయి ఆ విషయం సర్దాలి. మేనేజరు కదా! తప్పదు ఎలక్ట్రీషియన్‌ను అతని ఇంటి నుంచి పిలిపించి ఏ.సి బాగుచేయించి గొడవ సర్దేసరికి రాత్రి రెండు దాటింది.

మళ్ళీ ఉదయం అయిదున్నరకి లేవాలి. స్నానపానాదులు ముగించుకుని రొటీన్‌లో పడాలి. గాసుగెద్దు జీవితం.

"ఫాదర్ సీరియస్ స్టార్ట్ ఇమ్మీడియెట్లీ" ఓ రోజు పొద్దున టిఫిన్ చేస్తుంటే రఘుకు టెలిగ్రాం. తమ తండ్రి సీరియస్‌గా ఉన్నాడు. వెంటనే రమ్మని, అన్నయ్య ఇచ్చిన తంతి అది.

'ఒకరి సంపాదనపై బతికేకంటే చావడం మేలు' చెవిలో హోరుమన్న మాటలు.

ఆ టెలిగ్రాం ఉండగా నలిపి విసిరికొట్టాడు రఘు. టిఫిన్ కొనసాగించాడు.

అతని ముఖకవళికల్లో మారిన రంగులు, కళ్ళలో ప్రస్ఫుటించిన కసి గమనించాడు మాతాప్రసాద్. కిందకు వంగి ఆ టెలిగ్రాం తీసి, సరిచేసి, చదివాడు "రఘుబేటా! మీ ఊరికి వెళ్ళడానికి సిద్ధం కా. నీ ప్రయాణ టిక్కెట్లు ఏర్పాటు చేస్తాను." మాతా ప్రసాద్ డైనింగ్ టేబిల్ దగ్గర నుంచి లేచి వెళ్ళిపోయాడు.

రఘుకి వెళ్ళడం ఇష్టం లేదు కానీ యజమానికి ఎదురు చెప్పలేదు. అన్యమనస్కంగా ప్లేట్లో కెలుకుతూ కూర్చున్నాడు. ఏదో ఆవేశంలో టెలిగ్రాం కిందికి విసిరి కొట్టాడు కాని ఇప్పుడు? మనసు మనసులో లేదు కోపం స్థానం, శోకం తీసుకొంది.

ఎంతైనా తన కన్నతండ్రి! ఆయన మాత్రం ఏమన్నాడని? డిగ్రీ చేసి మూడేళ్ళయినా ఉద్యోగం చూసుకోలేకపోయాడని కోప్పడ్డాడు. తనను కని పెంచి, పెద్ద చేసిన ఆయనకు ఆ మాత్రం హక్కు లేదా? తనను కాలేజీకి పంపడానికి ఎంత కష్టపడ్డాడని? డిగ్రీ చదివించడం, తమ కుటుంబానికి తలకుమించిన భారమయింది. తన ఖర్చులకు బోలెడు డబ్బు ఖర్చయింది. కుటుంబం అప్పుల వలయంలో చిక్కుకుంది. తమ కంటే ఆర్థికంగా మెరుగ్గా ఉన్నవారు కూడా ఖర్చులకు భయపడి, తన తోటి వారిని కాలేజీకి పంపలేదు. ఊళ్ళోనే ఏవో చిన్నా చితక పనుల్లో సెటిలయిపోయారు వారు. తన తండ్రి అలా కాదే? డిగ్రీ వరకు చదివించాడు. అంత త్యాగం చేసిన అతని పట్ల ఏ మాత్రం స్పందన లేదేం? అతను సీరియస్‌గా ఉన్నాడనే వార్త విని కూడా తను ఊరికి పోననడం అమానుషం కాదూ? రఘు హృదయం కరగనారంభించింది. రఘు కళ్ళలో నీళ్ళు అవి తుడుచుకునే ప్రయత్నం కూడా చేయలేదతను. శ్రీమతి శీలాప్రసాద్ అతని కళ్ళను తుడిచింది. " అంతా మంచే జరుగుతుంది. భయపడొద్దు" అని అనునయించింది. ఓ నోట్లకట్ట చేతిలో ఉంచి ప్రయాణ సన్నాహాలు చేసుకోమంది.

రఘును చూడగానే సీతయ్య కళ్ళ నుంచి అశ్రుధారలు. తండ్రిని కౌగలించుకుని నిశ్శబ్దంగా రోదించసాగాడు రఘు. వారిద్దరికి మాటలు కరువయ్యాయి. చూపులతోనే ఎన్నో విషయాలు చెప్పుకొన్నారు. వారి హృదయాల్లో ఎన్నో భావకెరటాలు. ఎన్నెన్నో జ్ఞాపకాలు! రఘు రాకతో సీతయ్య ఆరోగ్యం కోలుకునే బాటన పడింది. ఇంట్లో నవ్వుల పువ్వులు విరిసాయి. రఘును ఓ వి.ఐ.పి.లా గౌరవిస్తున్నారు. రకరకాల పిండివంటలు, తీపి పదార్థాలతో ప్రతి పూటా విందు భోజనమే. రోజుకు రెండుసార్లు టిఫిన్లు, రెండు భోజనాలు ఇలా అమ్మా చెల్లెళ్ళు తనను గారాబం చేస్తుంటే రఘుకు తన ఇంట్లోనే మొహమాటంగా ఉంది. వీళ్ళేనా తనను అంతంత మాటలన్నది? మూడేళ్ళలో ఎంత పెనుమార్పు? మాటల్లో ఎంత ఆప్యాయత! తను నెలనెలా పంపే డబ్బుతో కుటుంబం ఎలా పుంజుకుందో విడమరచి చెప్పడాలు, మున్ముందు ఉన్న ఖర్చుల పట్టిక సున్నితంగానే వల్లెవేయడం, రఘుకు వింతగా ఉంది.

అవునూ, వీళ్ళు తనను తమ అప్పునిగా కుటుంబసభ్యునిగా ప్రేమతో గౌరవిస్తున్నారా?

లేక క్రమం తప్పకుండా డబ్బు పంపే పాడి ఆవుగా గణిస్తున్నారా? ఇంటి వారికి తన పట్ల అంత మర్యాద, మన్నన అంతా డబ్బు ప్రభావమే అన్న నిష్కర్షకు వచ్చాడు రఘు. ఔరా డబ్బు! కుటుంబ సంబంధాలను ఎలా శాసిస్తుంది? మమతలూ, మమకారాలు కథల్లోకే పరిమితమయ్యాయా? రఘు బుర్ర బద్దలయినా జవాబు అందలేదు.

రఘు వచ్చి అప్పుడే వారం దాటింది. సీతయ్య బాగానే కోలుకున్నాడు. పొలం వెళతానని పట్టుబడితే కొడుకులు వారించారు.

"ఇక నేను వెళతా నాన్నా"

"అప్పుడేనా? మూడేళ్ళకు వచ్చావు మూడు వారాలైనా ఉండరాదూ'? సీతయ్య అభ్యర్థన.

"అవునూ, అక్కడ ప్రాంతంగాని ప్రాంతంలో ఉంటూ తిండిగూడా సమయానికి లేక ఎంత కష్టపడుతున్నావో ఇక్కడే ఉండి ఏదో వ్యాపారం చేయరాదూ?" తల్లి మందలింపు.

అక్కడ పొద్దున నుంచి రాత్రి దాకా ఒొళ్ళువంచి పనిచేసినట్టు ఇక్కడ కూడా చాకిరి చేస్తే ఆ మాత్రం డబ్బు ఇక్కడా సంపాదించొచ్చు" అన్నయ్య వ్యాఖ్య.

"ఏరా అన్నయ్యా! రెక్కలు ముక్కలు చేసుకుని ఎవరినో ఉద్ధరించే కంటే ఇక్కడే మనకోసం మన కుటుంబం బాగు కోసం పాటుపడరాదూ?" చెల్లెళ్ళ ఉచిత సలహా.

"వ్యాపారంలోని కిటుకులు ఈ పాటికే ఒంటబట్టించుకున్నావుగా! ఇకనేం? ఇక్కడే ఓ కుటుంబావసరాల షాపు తెరచి నడపరాదూ?" తండ్రి సూచన.

రఘు తల తిరిగిపోయింది. ఏంటి వీళ్ళనేది? వ్యాపారమంటే మాటలా? పెట్టుబడి కావాలి. నేర్పు కావాలి, పోటీకి తట్టుకుని నిలిచే స్థైర్యం కావాలి. వీటికి తోడు అదృష్టం కలిసిరావాలి. పులిని చూసి నక్క వాతపెట్టుకున్నట్టు తన వాళ్ళ విచిత్ర ధోరణి ఏ వైపు వెళుతోంది? విధి వక్రిస్తే కాలేది తన ఒళ్ళు. రెంటికి చెడ్డ రేవడవుతాడు. "ఆలోచిస్తాను" అని బయటపడ్డాడు రఘు.

"ఏం చేయాలి? తిరిగి పాట్నా వెళ్ళాలా, వద్దా? తన వారిని ఎంతవరకు నమ్మవచ్చు? బెడిసి కొడితే మళ్లీ సూటి సోటి మాటలు తప్పవు' ఊరిబయట గోదావరి గట్టున ఓ చెట్టు కింద పడుకుని ఆలోచిస్తున్నాడు రఘు.

"బేటా రఘూ" ఎవరో పిలిచినట్టయింది. కళ్ళు తెరచి చూస్తే? బాబూజీ, బీబీజీ!

"నీవు లేకుండా మా ఇల్లు బోసిపోయినట్టయింది మా చేతులూ కాళ్ళూ ఆడడం లేదు. మమ్మల్ని మరచిపోయావా రఘూ?"

"మేమూ నీ అమ్మా, నాన్నలమేగా మమ్మల్ని ఇంకా బాధపెట్టక తొందరగా, రావూ?

"లేదు లేదు, నా అన్నదాతలు మీరు. మిమ్మల్ని వదిలి నేను మాత్రం ఉండగలనా? వస్తాను తప్పక వస్తాను"

"ఏరా తప్పక వస్తాను అంటున్నావు నీ బీహార్ లవర్‌తోనా?"

కళ్ళు తెరచి చూస్తే క్లాస్‌మేట్ కృపాకర్. అప్పుడుగాని తాను కలత నిద్రలోకి జారినట్టు తెలుసుకోలేదు రఘు.

"నా బతుక్కి లవరొక్కతే తక్కువ" నిట్టూర్చాడు రఘు.

"కోతలు కొయ్యకు ఈపాటికి అక్కడ ఎవర్నో పట్టలేదంటే నేనేనా నమ్మేది? ఇక్కడి నీ నిర్వాకం నాకు తెలియదూ?"

"అక్కడ నాకంత సీన్ లేదు కృపా. రోజంతా పనితోనే సరిపోతుంది. అయినా నా మొహం చూసి ఎవరొస్తారు?"

"నీ మొహానికేం, బాబూమోహన్‌కు ఎక్కువా, బ్రహ్మానందానికి తక్కువా ఇంకా నీకేం తక్కువ? డిగ్రీ చదివావు పెద్ద వ్యాపార సంస్థలో మేనేజరుగా ఉన్నావు అన్నిటికి మించి వయసులో ఉన్నావు. లవరనగానే అలా నీరసపడిపోతావేంటి?"

"నీ ధోరణి నీదే కాని, నా మాట వినిపించుకోవేం? ఇప్పుడు నేనో ధర్మ సంకటంలో పడ్డాను."

"అంతంత బరువైన మాటలెందుకులే గానీ, విషయమేమిటో చెప్పు."

మా వాళ్ళు తిరిగి పాట్నా వెళ్లొద్దంటున్నారు. ఓ హోం అప్లయన్సెస్ షాప్ తెరిచి ఇక్కడే ఉండమంటున్నారు.

"ఇంకేం ఉండిపో".

"అక్కడి మా శేటు? బీబీజీ? వారికి నేనంటే ఎంతో ప్రేమ, నమ్మకం. వ్యాపారాలు నాకు అప్పగించి, మేనేజరు హోదా కల్పించిన వారి పట్ల కృతజ్ఞతగా ఉండాలి కదా?"

"ఉండాలి, కాని వారికి నీ పట్ల, నిజంగా ప్రేమ ఉందనుకుంటున్నావా? పగలనక, రాత్రనక వెట్టిచాకిరి చేసే నీలాంటి నమ్మకస్తుడు వారికి మాత్రం ఎక్కడ దొరుకుతాడు?"

"అలా అన్యాయంగా మాట్లాడకు కృపా, వారెంత సహృదయులో నీకు తెలియదు. నన్నెప్పుడూ వారి ఉద్యోగిగా చూడలేదు. ఇంట్లో మనిషిగానే ఆదరించారు".

"పిచ్చి రఘూ, అదే వ్యాపార లక్షణం. కుక్కను కూడా బాగా పెంచి పోషిస్తారు. అది విశ్వాసం కలది కాబట్టి! నీ పట్ల వారు చూపే ఆపేక్ష కూడా అలాంటిదే. అంత దూరం పోయినా నీకింకా లోకం తెలిసినట్టు లేదు.

"నీకు మహా తెలిసిందిలే. నీదంతా వితండవాదం. వారిని ఎన్నడూ చూడనైనా చూడని నీవు, అలా మాట్లాడడం బాగా లేదు. ఏ దిక్కూ లేకుండా దారి తప్పిన నన్ను అక్కున చేర్చుకున్నారు. నాకు తలదాచుకునే చోటిచ్చారు. మేనేజరు హోదా కల్పించారు. తాము తినేదే నాకు పెడుతున్నారు. నేను తుమ్మినా వారు విలవిలలాడుతారు. మంచి డాక్టర్లతో వైద్యం చేయిస్తారు. నాలో, అమెరికాలో ఉన్న వారి అబ్బాయిని చూసుకుంటున్నారు. వారి అనురాగం, ఆత్మీయత, నేను మాటల్లో చెప్పలేను.

"అంతలా నిన్ను అభిమానించే వాళ్ళు నిన్ను ఔట్‌హౌస్‌లో ఎందుకుంచారు. తమతోపాటే బంగళాలో ఉంచుకోవచ్చుగదా!"

"అదా నీ సందేహం? వారితో బంగళాలోనే ఉండమని, సంవత్సరంనుంచీ పోరుతున్నారు. నాకే మనసొప్పడం లేదు. అంత గౌరవానికి నేను తగననిపిస్తోంది. నీకు తెలుసుగా, నేల విడిచి సాము చేయడం నాకిష్టం ఉండదు."

"మరింకేం తిరిగి వెళ్లిపో. వాదనెందుకు? నిన్ను కని, ఇరవై ఐదేళ్ళు పెంచి, పోషించిన వారి పట్ల నీకే కర్తవ్యమూ లేదు. మూడేళ్ళు నీతో వెట్టి చాకిరి చేయించుకుని ఓ ముద్ద వేసిన వాళ్ళ పట్ల మాత్రం కృతజ్ఞత! బాంధ్యవ్య బంధం కంటే, ఆత్మీయత తాడుతో కట్టిన బంధనమే నీకు హాయిగా ఉంటే రేపే పాట్నా బయలుదేరు."

"కృపాకర్ ఎప్పుడూ అంతే కట్టె విరిచినట్టు మాట్లాడతాడు." మనసులో అనుకున్నాడు రఘు. బయటికి మాత్రం. "కృపా, వడ్డించిన విస్తరి నీది. దాని మీదుండే పదార్థాలు కోసం కాదు గదా, ఆ విస్తరి కోసం కూడా సంఘర్షణ చేయవలసి వచ్చిన జీవితం నాది. నీకు నా బాధ, వ్యధ, అర్థం కావులే."

"అర్థం చేసుకోవాలని కూడా నాకు లేదు. నీవు లేనప్పుడు మీ వారి బాధ చూశాను గనక నీతో ఇంతగా వాదిస్తున్నాను సరే, రాత్రి కావస్తోంది. ఇంటికి పద. మీ నాన్నగారిని చూసి మూడు రోజులయింది. ఓసారి పలకరించాలి లే."

మర్నాడు తిరుగు ప్రయాణం సన్నాహాలు మొదలుపెట్టాడు రఘు. రాత్రంతా నిద్రపోలేదు. ఎడతెగని ఆలోచనలు.. తనవారి స్వార్థపూరిత బాంధవ్య బంధం కంటే బాబూజీ, బీబీజీల ప్రేమ పాశమే హాయిగా అనిపించింది. దానిలోనూ స్వార్థం ఉండొచ్చు కాని అక్కడ తనకు గుర్తింపూ, తన జీవితానికో అర్థమూ ఉన్నాయి. ఆ బంధనబంధం అంత గట్టిది!

**ఆదివారం ఈనాడు 19-5-2002**